
ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపిన ప్రశాంత్‌రెడ్డి
» రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి 8
ముప్కాల్‌లో ముందస్తు అరెస్టులు 8
పాకాల అడవిలో లేగదూడను చంపిన చిరుత
» జానకంపేటలో మేకపిల్లను ఎత్తుకెళ్లిన చిరుతపులి 6





మాట్లాడుతున్న కలెక్టర్

రేషన్ షాపులు, మీ సేవ కేంద్రాలను తనిఖీ చేయండి

● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రేషన్ షాపులు, మీసేవ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో లోటుపాట్లకు తావులేకుండా ఉండేందుకు గాను క్షేత్రస్థాయిలో చౌక ధరల దుకాణాలను సందర్శించి, వాటి పనితీరును పరిశీలించాలని సూచించారు. అన్ని రేషన్ షాపులలో పక్కాగా నిబంధనలు అమలయ్యేలా, సక్రమంగా నిర్వహణ జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మీసేవ కేంద్రాలలో దరఖాస్తుదారుల నుంచి నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుందని, అధిక డబ్బులు వసూలు చేసే

మిగతా 8వ పేజీలో..

23న విద్యాసంస్థల బంద్

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రధాన సమస్యలు పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైనందున వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకుడు రఘురాం పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో వివిధ వామపక్షాల పార్టీలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన సమస్యలు ప్రభుత్వం పట్టించు కోవడం లేదని విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ విద్యాసంస్థల పిలుపును ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, నాగరాజు, దినేష్, గణేష్ పాల్గొన్నారు.

రాజకీయ రగడ

జిల్లాలో ఒక్కసారిగా వేడెక్కిన బీఆర్ఎస్-కాంగ్రెస్ రాజకీయం

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పరస్పర ఆరోపణలతో ఒక్కసారిగా జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హస్తం, కారు పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం జిల్లా రాజకీయాల్లో రగడకు కారణమైంది. బాల్కొండ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ నుంచి ముగ్గురు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు ఉండగా గత ఎన్నికల్లో ఓడిపోయిన సునీల్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి గెలుపొందిన మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తన అనుచరవర్గాన్ని కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. గతంలో తన వెంట ఉన్న నాయకులు ఎవరూ పార్టీని విడిచిపెట్టి పోకుండా కాపాడగలుగుతున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో కాంగ్రెస్-బీజేపీల మధ్య పోటీ ఉండగా బాల్కొండ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్-బీఆర్ఎస్‌ల మధ్య పోటీ ఉన్నట్లు స్పష్టమవుతోంది.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



మోహన్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు



ఆందోళనకారులను ఠాణాకు తరలిస్తున్న దృశ్యం

» కాంగ్రెస్ పార్టీ 'కనువిప్పు' కార్యక్రమం పిలుపుతో ఉద్రిక్తత
» బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల తూటాలు
» ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇంటి ముట్టడికి హస్తం నాయకుల ప్రయత్నం
» ఇంట్లోకి ప్రవేశించిన ఎన్ఆర్ఐ సెల్ నాయకుడిపై దాడి
» ఇరు వర్గాల తోపులాట, నినాదాలు
» అడ్డుకున్న పోలీసులు, పలువురు నాయకుల హౌజ్ అరెస్ట్
» బాల్కొండ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలకు ముందే పొలిటికల్ హీట్

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల వేల్పూరు మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో గల్ఫ్‌లో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధి తులకు ఎలాంటి సహాయం చేయడం లేదని వ్యాఖ్యానించారు. దీంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ 'కనువిప్పు' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా మండల కేంద్రం వేల్పూర్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కనువిప్పు కార్యక్రమంతో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి కనువిప్పు కలిగించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలు పునివ్వడంతో గురువారం ఉదయం నుంచి జిల్లాలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నాయి.

వేల్పూర్ 163 సెక్షన్

జిల్లా వ్యాప్తంగా ముఖ్య కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయగా వేల్పూర్ మండల కేంద్రంలో బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ శ్రేణులు సైతం దీటుగా సమాధానం ఇచ్చాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డిని మోర్తాడ్‌లో పోలీసులు హౌజ్ అరెస్టు చేయగా కాంగ్రెస్

మిగతా 8వ పేజీలో...

వేల్పూర్‌లో తీవ్ర ఉద్రిక్తత

» కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం
» ఇరు పార్టీల నాయకులను అరెస్టు » భారీగా పోలీసుల మోహరింపు

వేల్పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కనువిప్పు పేరట కాంగ్రెస్, పరిచయం పేరిట బీఆర్ఎస్‌లు తలపెట్టిన కార్యక్రమాలు రోజంతా హై టెన్షన్‌ను సృష్టించాయి. ఇరు పార్టీల పిలుపులో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు, ప్రత్యేక బలగాలు వేల్పూర్‌లో భారీ ఎత్తున మోహరించారు. ఒకరోజు ముందే బీఎన్‌ఎస్ 163 సెక్షన్‌ను సీపీ ఆదేశాల మేరకు విధించారు. ఉదయం 10 గంటలకు వేల్పూర్‌కు వస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడంతో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. మేము కూడా సిద్ధమని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించడంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ నాయకుడు రేగుల్ల రాములు గాంధీ విగ్రహం వద్దకు అధికార కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా

మిగతా 8వ పేజీలో...

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి కేటీఆర్ ఫోన్..

» కాంగ్రెస్ దాడిని ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ప్రశాంత్‌రెడ్డితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడులను ఆపకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందన్నారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన గుండాలను వదిలేసి బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు కూడా ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండించారు. గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే ఇళ్లపై దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా రాహుల్‌గాంధీ చెబుతున్న మొహబత్‌కి దుకాన్ అని ప్రశ్నించారు. దాడులు చేస్తుంటే పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వంపై నిందలు వేయడం మానుకో

» ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?
» జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి 8

మానాల నీ కళ్లు చల్లబడ్డాయా?

» ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటాం.. 8
» బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



స్టాళ్ల వద్ద తినుబండారాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్

» 32 రకాల ఫుడ్‌స్టాళ్ల ఏర్పాటు 8
» మూడు రోజుల పాటు నిర్వహణ



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్, సీపీ తదితరులు

మమ్మల్ని కరుణించు తల్లీ

» నవదుర్గ అమ్మవారికి ఘనంగా బోనాలు 8
» ఉత్సవాల్లో ఎమ్మెల్యే, కలెక్టర్ పూజలు



మొక్కలు నాటుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

భవిష్యత్ తరాల కోసం కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

» అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భావి తరాల భవిష్యత్ కోసం కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. నగరంలోని సారంగపూర్ అర్బన్ పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 76వ వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణం అంటేనే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టు ఉన్న ప్రకృతి అన్నారు. మానవ మనుగడకు అభివృద్ధికి అత్యంత ఆవశ్యకత అయినటువంటి పర్యావరణం మొత్తం కలుషితం అవుతుందన్నారు. ఔషధ గుణం ఉన్న చెట్లు అరటి, రావి, తులసి, మర్రి, మామిడి, వేప వంటి చెట్లు పెరట్లో పెట్టుకుని పూజించేవాళ్లమన్నారు. ప్రస్తుతం వాటిని పూజించడానికి గుడికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాలుష్య నివారణకు పర్యావరణ పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. 2018 సంవత్సరం ఆగస్టు 15నుంచి 22వరకు దేశ రాజధాని ఢిల్లీలో పదిలక్షలకు పైగా నీడనిచ్చే ఔషధ మొక్కలు నాటడం జరిగిందన్నారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 76వ వనమహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ తీసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సుధాకర్, ఎఫ్ఆర్‌వోలు సంజయ్‌గౌడ్, రవి మోహన్‌భట్, రాధిక, పర్యావరణ ప్రేమికుడు గ్రీన్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు



శాకంబరి అవతారంలో అమ్మవారు

శాకంబరీ నమోస్తుతే

నిజామాబాద్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమ్మవారికి ప్రీతికరమైన ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని వాసవీ కన్యకాపరమేశ్వరి శాకాంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. రెండు రోజుల పాటు అమ్మవారు శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి అభిషేకం నిర్వహించి అలంకరించిన కూరగాయలతో అన్న ప్రసాదం అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బస్సులు బంద్ చేస్తాం..

» ఆర్టీసీకి అద్దెబస్సు ఓనర్ల అల్టిమేటం
» బిల్లులు చెల్లించాలని డిమాండ్
» ఆర్ఎంకు సమ్మె నోటీసులు అందజేసిన యజమానులు



ఆర్ఎం జోత్స్నకు నోటీసు అందజేస్తున్న అద్దె బస్సుల యజమానులు

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా నెలనెలా ఇవ్వాల్సిన బిల్లులు సైతం సమయానికి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ అద్దె బస్సుల యజమానులు ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జోత్స్నకు తమ గోడును విన్నవించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయంలో టీఎస్ ఆర్టీసీ హైర్‌బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేసి సమ్మె నోటీసును ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తూ ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె జరిగినా సంస్థకు సహకరిస్తున్నామన్నారు. కొన్ని నెలలుగా సమయానికి బిల్లులు రాక డ్రైవర్లకు సమయానికి జీతాలు ఇవ్వలేక బస్సులను నడపలేకపోతున్నామన్నారు. మహాలక్ష్మీ పథకం వచ్చిన తర్వాత బస్సులలో విపరీతమైన రద్దీ పెరిగి బస్సుల టైర్లు పగిలిపోతున్నాయని అన్నారు. కమాన్‌పట్టీలు విరిగి మెయింటెన్స్ పెరిగిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామన్నారు. మూడు నెలల నుంచి డ్రైవర్లను ఆర్టీసీ సంస్థ ఔట్‌సోర్సింగ్ పేరి ట అద్దె బస్సులపై చేసే డ్రైవర్లను 90శాతం తీసుకుని మా బస్సులను సరిగా నడపలేని పరిస్థితి యాజమాన్యం కల్పించిందన్నారు. జూన్ 20, 25 అద్దె బిల్లు ఇప్పటికి ఇవ్వకపోవడంతో జీతాలు ఇవ్వలేక, ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 15వ తేదీలోపు ఫైనాన్స్ కట్టకపోతే బస్సులను లాక్కుపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో 21వ తేదీ నుంచి నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆర్మూర్, కామారెడ్డి, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ బస్సులను నిలిపివేస్తామని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆర్ఎంను కలిసినవారిలో టీఎస్ ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రసిడెంట్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సంజీవరావు, జిల్లా సెక్రెటరీ ఉన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల విడుదల

డిచ్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలు గురువారం విడుదల చేశారు. 2వ సెమిస్టర్ 27శాతం, 4వ సెమిస్టర్ 38శాతం, 6వ సెమిస్టర్‌లో 44శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌కె రసూల్‌బీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దివ్యాంగులకు స్వయం ఉపాధి నిమిత్తం నెలకొల్పబోయే చిన్నపాటి వ్యాపారాలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందన్నారు. 21 నుంచి 51 ఏళ్ల గల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 50వేలకు 100 శాతం సబ్సిడీ ఉంటుందని లక్ష రూపాయలకు 80 శాతం, 2లక్షలకు 70 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. మిగతా వివరాల కోసం 08462-251690 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతులకు ఎరువులు అందించాలి



నిజామాబాద్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులు లేక అల్లాడిపోతున్నారని ప్రభుత్వం వెంటనే రైతులకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ అసమర్థతకు నిరసనగా ఈనెల 21న ఆందోళనకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, రామయ్య, దేవారాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో విద్యార్థులకు అన్యాయం

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి బీసీ విద్యార్థులకు షరతులు విధించడం అన్యాయం అన్నారు. బీసీ విద్యార్థులకు 10వేల ర్యాంకులోపల వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా పూర్తిగా ఇవ్వకుండా 35వేల రూపాయలు ఇవ్వడం సరికాదన్నారు. ఈ సమావేశంలో గంగాకిషన్, దర్శనం దేవేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


ఆర్మూర్‌లో ప్రభుత్వభూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ , జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంతంలో లేఅవుట్లలో వదిలిన పదిశాతం భూములను పరిరక్షించాలని, వాటిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పదిశాతం, ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబ్జా అయిన భూములు, అన్యక్రాంతమైన భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి బోర్డులు పెట్టాలని సూచించారు. వివిధ వెంచర్లలో నాలుగు ఎకరాలకు పైగా భూమిని గుర్తించామని వాటిలో చెట్లు నాటాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పెర్కిట్ విశాఖ కాలనీలో ఇరిగేషన్ భూముల హద్దులను గుర్తించాలని అధికారులు సమన్వయంతో పనిచేసి అసైండ్ భూములలో కట్టడాలకు పర్మిషన్ ఇవ్వకుండా ఉండాలని అన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత కాలనీవాసులదేనన్నారు. ఈ సందర్భంగా గూండ్ల చెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వినాయక నిమ్మజ్జనం సందర్భంగా విగ్రహాలు లోపలికి తీసుకురావడం కష్టమవుతుందని రోడ్లు వెడల్పు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మామిడిపల్లిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, నాయకులు కలిగోట గంగాదర్, చిన్నారెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమ్‌గల్ , జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణకేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి శ్రీమాన్ నవోదయ విద్యాలయ సమితికి (నిజామాబాద్) ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ జి.బసంత్‌రెడ్డి, కమిటీసభ్యులు సరస్వతి విద్యాపీఠం ఇందూర్ విభాగ్ ప్రముఖ్ పక్కి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దేవి, రవినాథ్, ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ జి.నర్సారెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి సాయిచరణ్, ఉపాధ్యాయులు శ్రీమాన్‌ను అభినందించారు.

క్రైం న్యూస్

జానకంపేటలో చిరుత పులి కలకలం


చిరుత ఆనవాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎడపల్లి, జూలై17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకంపేట గ్రామంలో బుధవారం రాత్రి చిరుతపులి కలకలం రేపింది. గ్రామానికి చెందిన వెల్మల సందీప్ అనే వ్యక్తికి చెందిన పశువుల పాక నుంచి బుధవారం రాత్రి చిరుత పులి మేకపిల్లలను ఎత్తుకెళ్లింది. పశువుల పాకలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చిరుతపులి మేక పిల్లను ఎత్తుకెళ్లిన దృశ్యాలు కనిపించాయి. గురువారం ఉదయం వెల్మల సందీప్ ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్టు అధికారులు చిరుత పులి ఆనవాళ్లను పరిశీలించారు.

లేగదూడను చంపిన చిరుతపులి


చనిపోయిన లేగదూడను పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ జులై 17 (ఆంధ్రజ్యోతి) : పాకాల అడవిలో చిరుతపులి దాడి చేసిన సంఘటనలో లేగదూడ చనిపోయింది. ఇటీవల మండలానికి పెద్దపులి వచ్చిందని తాటిపల్లి చెరువులో పాదముద్రల ద్వారా ఎనిమల్ ట్రాకర్ సిబ్బంది గుర్తించిన విషయం పాఠకులకు విధితమే. పందిమడుగు సెక్షన్ పరిధిలో గల పాకాల సౌత్‌బీట్‌లో 495 కంపార్టుమెంట్‌లో అవు చనిపోయిందని అందిన సమాచారం మేరకు గాలించగా పాకాల గ్రామానికి చెందిన తేజవత్ బాబుకు చెందిన లేగదూడ చనిపోయి ఉంది. జరిగిన సంఘట గురించి తెలుసుకున్న నిజామాబాద్ డీఎఫ్‌వో భోగ నిఖిత,ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్,కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ, రేంజ్ అధికారులు రవీందర్,వాసుదేవ్,ఎనిమల్ ట్రాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి ఆవును చంపింది పెద్దపులా, చిరుతపులా అని పరిశీలించారు. ఎనిమల్ ట్రాకర్ సిబ్బంది చిరుత పులిగా నిర్దారణ చేశారు. చనిపోయిన లేగ దూడకు పశువైద్యాధికారి డాక్టర్ అభిషేక్ పోస్టుమార్టం చేశారు. లేగదూడ చనిపోయిన బాబుకు అటవీ శాఖ ద్వారా నష్ట పరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో రేంజ్ అధికారిని ఆదేశించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మోపాల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్రాబాద్ గ్రామానికి చెందిన ప్రకాశ్ (41) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రకాశ్ తన వ్యవసాయ పొలం వద్ద అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగుల మందు తాగిన ప్రకాశ్ ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో వెంటనే కుటుంబసభ్యులు గమనించి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించినట్లు ఎస్సై తెలిపారు. ప్రకాశ్ కొన్ని రోజుల క్రితం గల్ఫ్ దేశం వెళ్లి 4లక్షల వరకు అప్పు చేశాడని అప్పుల బాధతోనే ప్రకాశ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రకాశ్‌కు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆర్మూర్‌లో మహిళ...

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని రాజారాంనగర్ కాలనీకి చెందిన నీరుగంటి శశికళ (40) అనే మహిళ ఇంటిలో పైప్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అదే కాలనీకి చెందిన వడ్డీ వ్యాపారి శ్రీనివాస్ వద్ద గతంలో 15వేలు అప్పుగా తీసుకున్నారు. ఇప్పటి వరకు 36 వేల వడ్డీ కట్టినా అసలు కట్టమని వేధించడంతో కట్టలేని పరిస్థితిలో ఉన్నామని తెలుపగా శ్రీనివాస్ ఆమెను బెదిరించారు. ఎలాగైనా కట్టాలని ఒత్తిడి చేయడంతో బాధలు భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఆమె కుమారుడు యోగేశ్వర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

రెంజల్,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం శివారులో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. బోర్గాంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా నెహ్రూనగర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, ఎడపల్లి మండలానికి మరో వ్యక్తి మద్యం సేవించి వాహనాలు నడపడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అవ్వడంతో ఇరువురిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా గురువారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి ఒక వ్యక్తికి మూడు రోజులు, మరో వ్యక్తికి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా, పేపర్‌మిల్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్‌తో పాటు ఓనర్‌పైన కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

పామాయిల్ సాగును ప్రోత్సహించాలి

● రైతులకు అదనపు ఆదాయం
● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,జూలై17(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటతో పాటు పామాయిల్ పంటల సాగుపై సైతం దృష్టి సారించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్ పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూర్చే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు బాధ్యతయుతంగా పనిచేయాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం సంవత్సరంన్నర కాలంలో రాష్ట్రంలో ఆరులక్షల రేషన్ కార్డులు అందించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చూడడంతో పాటు మంచి ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ, హౌసింగ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ, వ్యవసాయం వంటి వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాంచందర్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఎస్సీసబ్‌ప్లాన్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న అన్ని సౌకర్యాలను తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, శివ, సాయిబాబా గౌడ్, క్రాంతి కుమార్, ఖుద్దుస్, నర్సయ్య, రవీందర్ గౌడ్, సగ్గు వెంకటి, అసాని అనిల్, యోగేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డిని గురువారం మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతున్న సాయిరెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బోధన్ : బోధన్ పట్టణంలోని అన్ని వార్డులలో కల్వర్టులు, డ్రైనేజీల వద్ద మురికినీరు, వర్షపు నీరు నిలిచి ఉండకుండా పారిశుద్ధ్య విభాగం సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేటతో పాటు పలు వార్డులను ఆయన సందర్శించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ జాదవ్ కృష్ణ, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, అఖిల్ ఫారూఖి, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాలూర సొసైటీ అధ్యక్షులు అల్లె జనార్ధన్, కార్యదర్శి బస్వంత్ రావు, సభ్యులు సందీప్ రెడ్డి, రామకృష్ణ, భూమయ్య, సాయిలు, దేవేందర్ తదితరులున్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

తాడ్వాయి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలను వెంటనే చెల్లించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నారు. అనంతరం ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీకి వినతిపత్రం సమర్పించారు. ఇందులో మండల ఫీల్డ్ అసిస్టెంట్ అధ్యక్షుడు, సెక్రటరి సంతోష్, ఉపాధ్యక్షుడు రమేష్, అన్నీ గ్రామా ల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

తాడ్వాయి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్న బాధితురాలికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే నాలుగు లక్షల ఎల్‌వోసీని అందజేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు రాజీవ్, అధికార ప్రతినిధి షౌకత్ అలీ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాడ్వాయి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్కల్, దేమీకలాన్ గ్రామంలో రెండురోజుల క్రితం మరణించిన సొసైటీ చైర్మన్ రాజారెడ్డి తల్లి కాటిపల్లి సావిత్రమ్మ మరణించిన విషయం తెలిసి గురువారం ఎల్లారెడ్డి రాష్ట్ర బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి పరామర్శించారు. అనంతరం కన్కల్ గ్రామంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడ్డం వెంకట్ రామ్ రెడ్డి మరణించిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, మండల అధ్యక్షులు సంతోష్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆయిల్ పాం సాగుపై రైతులు దృష్టి సారించాలి

జక్రాన్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగు పంటపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారిని దేవిక అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలోని రైతు వేదిక భవనంలో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆయిల్ పాం సాగుకోసం పలు రకాల సబ్సిడీలను అందిస్తు ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ఈ పంట సాగు పై మెలకువలతో పాటు ఈ సాగు పంటకు సంబంధించిన పతకం గురించి రైతులకు అవగామన కల్పిస్తు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీకాంత్, భాస్కర్, సుభష్య, శివప్రసాద్, ప్రీయూనిక్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి రాకేష్, రైతులు పాల్గొన్నారు.

మచ్చర్లలో సదస్సు..

ఆలూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చర్లలో ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాంబాబు మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగుచేయడం వల్ల రైతులు ఆర్థికంగా లబ్ధిపొందవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, ప్రోత్సహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫాం కంపెనీ ప్రెసిడెంట్ అరుణ్, సింగిల్ విండో డైరెక్టర్ నర్సారెడ్డి, ఏఈవో రమ్య పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని, గ్రామం యావత్తు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటు కమ్మర్‌పల్లిలో గురువారం గ్రామాభివృద్దికమిటీ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు గ్రామ రక్షక దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర గంగాజలలతో దేవతామూర్తులకు జలాభిషేకం చేస్తు వర్షాలు కురిపించాలని ప్రత్యేక పూజలద్వార వేడుకున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో గ్రామశివారుల్లో కొలువైఉన్న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కుల చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు బోగ రామస్వామి, ఉపాద్యక్షులు గణేష్, కోశాధికారి నూకల బుచ్చిమల్లయ్య, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి తోడ్పాటు అందించాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తోడ్పటు అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి బోధన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలు, వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విద్యాసంస్థల ఆవరణలో, విద్యాసంస్థల రోడ్ల వెంబడి నీడనిచ్చే చెట్లు, పండ్ల చెట్లు, ఔషద మొక్కలు, ఇతర మొక్కలను నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పచ్చదనాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. బోధన్ డివిజన్‌లోని విద్యాసంస్థలు అన్ని వన మహోత్సవ కార్యక్రమానికి కృషి చేయాలన్నారు.

కొనసాగుతున్న వందరోజుల ప్రణాళిక

ఆర్మూర్ టౌన్ , జూలై 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కొనసాగుతుంది. గురువారం మున్సిపల్ పరిధిలోని 11, 26 వార్డులలో మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని, సిజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, ఇంచార్జి సానిటరి ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డ్ ఆఫీసర్‌లు ప్రవళిక , నిలిష్, జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.


తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

యంచలో పలు ఇళ్లలో చోరీ

నవీపేట,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో బుధవారం అర్ధరాత్రి పలు ఇళ్లలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇద్దరు దొంగలు చేతిలో మారణాయుధాలు ధరించి బుధవారం అర్ధరాత్రి యంచ గ్రామంలోకి ప్రవేశించారు. గ్రామానికి చెందిన పులి భూమయ్య ఇంటి ఆరుబయట నిలిపి ఉంచిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. రాములు, పెద్ద మారుతిలకు చెందిన తాళం వేసిన ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామంలో అద్దెకు ఉంటున్న నర్సయ్య అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు తన ఇంటికి తాళం వేసి నందిగామకు వెళ్లారు. దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం, 50వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. దొంగలకు సంబంధించిన ఆనవాళ్లు సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి. చోరీకి పాల్పడే ఇళ్లకు సమీపంలో ఉన్న పలు ఇళ్లకు దొంగలు గడియ పెట్టి ఈ చర్యకు పాల్పడ్డారు. అలికిడి విన్న స్థానికులు దొంగలను వెంబడించినప్పటికీ వారు చేతికి చిక్కలేదు. గురువారం ఉదయం సంఘటనా స్థలానికి నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఎస్‌ఐ వినయ్‌లు వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ సభ్యులు పలు ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎత్తొండలో పేకాట స్థావరంపై దాడి

కోటగిరి,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ గ్రామంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. పేకాట స్థావరంలో 24,200రూపాయలతో పాటు 8సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

కోటగిరి,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ తన ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాలలో 65మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పాపారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత కోనేరు వెంకట సుబ్బారావు, బీజేపీ నాయకులు విలాస్, శ్యామ్, వెంకటేష్, ప్రకాష్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపీడీవో

కమ్మర్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్ను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అమీర్‌నగర్, ఇనాయత్‌నగర్, నర్సాపూర్, డీసీ తండా గ్రామాలలో పర్యటిస్తు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం ఇందరమ్మ ఇడ్ల నిర్మాణ పనులకు సంభందించిన యాప్‌ను ఆయన పరిశీలలించారు ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయితి కార్యదర్శులు గ్రామ ఇందిరమ్మ కమిటిసభ్యులు ఉన్నారు.

'మహిళా సంఘాలు రుణాలను వినియోగించుకోవాలి'

బోధన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు మహిళ సంఘాల్లో ఉంటే వారికి ఇచ్చే ప్రత్యేక రుణాలు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళ సం ఘాల్లోని సభ్యులు వార్డులో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కావాల్సిన డబ్బులను సమకూర్చాలన్నారు. ఎవరికైతే ఇంటి నిర్మాణానికి డబ్బులు అవసరం ఉంటే అటువంటి వారికి లక్షరూపాయల వరకు రుణాలు అందజేయాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలకు బ్యాంకు నుంచి, సమాఖ్య నుంచి కాని రుణం ఇప్పించి వారు ఇల్లు నిర్మించుకునేలా సహకారం అందించాలన్నారు. లబ్ధిదారులు తీసుకున్న రుణాన్ని వాయిదాల ప్రకారం తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేష్, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సీవోలు శ్రీనివాస్, రిసోర్సపర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ గ్రీన్ సభ్యులు

ఆర్మూర్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంటిల్ కిడ్స్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని సంరక్షించడంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను స్కూల్ యాజమాన్యానికి అప్పగించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు ఆకుల రాజు, కార్యదర్శి శ్రీనివాస్, దాచపల్లి సంతోష్, బాలాజీ రావు, పోల్కం వేణు, నసీరుద్దిన్, గోపికృష్ణ, గంగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మండల బంజారా సంఘం కార్యవర్గం ఎన్నిక

కోటగిరి,జూలై17(ఆంధ్రజ్యోతి): మండల బంజారా సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలిండియా బంజారా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీహరి నాయక్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఫకీరా నాయక్, ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్, ఉపాధ్యక్షుడిగా మోహన్, యశ్వంత్, కోశాధికారిగా నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు రవి రాథోడ్, రంజ్యా నాయక్ పాల్గొన్నారు.

'ప్రజల పక్షాన పోరాడితే దాడులా'

భీమ్‌గల్ , జూలై 17 (ఆంధ్రజ్యోతి): చర్చలకు సిద్ధమని సవాల్ విసిరి ఎమ్మెల్యే నివాస గృహంపై కార్యకర్తలతో దాడికి యత్నించడమా సరికాదని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టన కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో టీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడి చేయించడం పరికి మాలిన చర్య అని అన్నారు. సమావేశంలో బాల్కొండ నియోజకవర్గంలోని అన్నా మండలాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

నవీపేట,జూలై17(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావును గురువారం పలువురు మండల బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాలలో గెలిపే లక్ష్యంగా పని చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాంచరణ్ యాదవ్, బూనాది ప్రవీణ్, శివ, ప్రేమ్ సింగ్ నాయక్ తదితరులున్నారు.

పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

కమ్మర్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేస్తు, బదిలీలతో కూడిన పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడదలచేయాలని డిమాండ్ చేశా రు. మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, బషీరాబాద్, హాసాకొత్తూర్, ఉప్లూర్ ఉన్నత పాఠశాలల్లో 2025 సంవత్సరానికి సంభందించి పీర్టీయూ సభ్యత్వ నవెదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంజద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియెట్ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస మూర్తి, రాష్ట్ర ఉపాద్యక్షులు రాధాకిషన్, మండల అసోసియెట్ అద్యక్షులు జ్ఞానేశ్వర్, మండల కార్యదర్శి రోహిత్ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

నవీపేట,జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ శివారులోని డీ50/4/10 ఉప కాలువకు సంబంధించిన దారిని ఇటీవల రైతులు స్వచ్ఛందంగా 3లక్షల రూపాయల వ్యయంతో దారిని ఏర్పాటు చేసుకున్నారు. సంబంధిత దారిని కమలాపూర్‌కు చెందిన ఒక వ్యక్తి జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ విషయంపై గురువారం గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కేంద్రంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నవీపేటలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఉప కాలువ ధ్వంసంపై విచారణ జరపాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశం మేరకు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ ఉప కాలువ ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు ఉప కాలువ సరిహద్దులను కొలతలు నిర్వహించారు.


నగరంలో పోతరాజుల విన్యాసం, బోనాల ఊరేగింపు

మమ్మల్ని కరుణించు తల్లీ

- ఘనంగా నవదుర్గ అమ్మవారికి బోనాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ

నిజామాబాద్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమ్మ మమ్మల్ని కరునించు తల్లీ.. అని వేడుకుంటూ ఆషాడమాస బోనాల పండుగను అమ్మవారికి సమర్పించుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో కొలువుదీరిన నవదుర్గ ఆలయంలో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యలు హాజరయ్యారు. అమ్మవారికి సమర్పించే బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు ఇచ్చే బోనం అంటే ప్రీతికరంగా స్వీకరిస్తుందని అన్నారు. ఆషాడమాసంలో ప్రతీ ఒక్కరు ఈ ఉత్సవంలో పాల్గొనే విధంగా ఉండాలని నాడు ఈ సాంప్రదాయాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే అమ్మవారికి బోనాలు సమర్పించడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. అమ్మ అనుగ్రహంతో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తులతో కలిసి బోనాలకు పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. బోనాల ఊరేగింపులో భక్తిపాటలు పాడుతూ పోతరాజుల విన్యాసాలతో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో నవదుర్గ ఆలయ కమిటీ చైర్మన్ టీజీవో అధ్యక్షుడు అలుక కిషన్, రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఆలయ ప్రధాన కార్యదర్శి అమృత్‌కుమార్, కోశాధికారి ఉమాకిరణ్, ఉపాధ్యక్షుడు చిట్టినారాయణరెడ్డి, సలహాదారులు ఆకుల ప్రసాద్, సభ్యులు దాస్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, మహిళా ఉద్యోగులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపిన ప్రశాంత్‌రెడ్డి

- రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రశాంతంగా ఉన్న బాల్కొండ ప్రాంతంలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నాడని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్ల అధికారం ద్వారా వచ్చిన డబ్బుతో యువతను రౌడీలుగా మారుస్తున్నాడని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని గల్ఫ్ బాధితుల కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ప్రశాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లిన కాంగ్రెస్ నాయకుడు నంగి దేవేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు రౌడీల్లా దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ప్రశాంత్‌రెడ్డి ఇలాంటి చర్యలకు ప్రోత్సహించడం సరికాదన్నారు.

ముప్కాల్‌లో ముందస్తు అరెస్టు

ముప్కాల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లో మానాల మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన కనువిప్పు కార్యక్రమానికి ముప్కాల్ మండల బీఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకులు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు వేల్పూర్‌లో ఉద్రిక్త వాతావరణం నివారణలో భాగంగా బీఆర్ఎస్ నాయకులకు నోటీసులు ఇచ్చి వేల్పూర్ వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ చంద రవి, మహేష్ యాదవ్ తదితరులున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఫుడ్‌ఫెస్టివల్‌ను గురువారం నిర్వహించారు. సుమారు 32 ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ మహిళ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు వివిధ రకాల ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో మిల్లెట్లను మొదలుకొని వివిధ రకాల ఫుడ్‌కు సంబంధించిన రకాలను ఉంచారు. ఉదయం నుంచి ఫుడ్‌స్టాళ్లు ప్రారంభం కావడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఫుడ్‌స్టాళ్ల వద్ద ఆగి వివిధ రకాల తినుబండరాలను కొనుగోలు చేశారు. అంకాపూర్ స్పెషల్ అయిన మక్క వడలు, పిండి వంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజులు నిర్వహించే ఈ ఫుడ్‌స్టాళ్లు శుక్రవారం బోధన్ బస్టాండ్ వద్ద, శనివారం వినాయక్‌నగర్ రుక్మిణి ఛాంబర్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టాళ్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు దారుల కోసం ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో రమేష్, సిబ్బంది శోభారాణి, తదితరులు పాల్గొన్నారు

రేషన్ షాపులు, మీ సేవ కేంద్రాలను తనిఖీ చేయండి

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. క్షేత్రస్థాయి విచారణ నిర్వహిస్తూ, పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులను పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 14 తేదీ లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. భూభారతి దరఖాస్తుల పురోగతిని అదనపు కలెక్టర్ , ఆర్డీఓలు ప్రతిరోజూ పర్యవేక్షిస్తారని, తాను కూడా క్రమం తపకుండా సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. భూభారతి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినందున, దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు, కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను అదే విధంగా కొత్త రేషన్ కార్డులు, కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటదివెంట పరిశీలన జరపాలన్నారు. అనర్హులకు రేషన్ కార్డులు మంజూరు కాకుండా పక్కాగా వెరిఫికేషన్ చేయాలని సూచించారు. రేషన్ కార్డుల జాబితాలో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే, వారి కార్డులను రద్దు చేయాలని అన్నారు. అయితే అర్హులైన ఏ ఒక్కరి కార్డు కూడా రద్దు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తహసిల్దార్లు స్వయంగా పరిశీలన జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు చేసుకుంటున్న లబ్దిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా జరిగేలా చొరవ చూపాలన్నారు. ఎక్కడ కూడా ఇందిరమ్మ ఇళ్ళకు సేకరించే ఇసుకకు డబ్బులు వసూలు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అదే సమయంలో ఇందిరమ్మ ఇళ్ళ పేరిట ఇసుక పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులపై ఇసుక చార్జీల రూపంలో అదనపు భారం పడకుండా చూడాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన రెండు పడక గదుల ఇళ్ళను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారికి కేటాయించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, హౌసింగ్ శాఖ అధికారి నివర్తి, అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

‘మానాల’ నీ కళ్లు చల్లబడ్డాయా?

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటాం..
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే తన ఇంటిపై దాడి చేయడం సరికాదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కనువిప్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్ నుంచి వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజం అని కానీ ఇంటిపై దాడి చేయడం సరికాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తన ఇంటిపై దాడి చేయాలని పిలుపునిచ్చారని ఇప్పటికైనా నీ కళ్లు చల్లబడ్డాయా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు అధికార పార్టీ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటాయని ఎమ్మెల్యేగా అది తన హక్కు అన్నారు. గల్ఫ్ కార్మికుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని అడిగితే అందులో తప్పేముందన్నారు. మానాల మోహన్‌రెడ్డి తన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. దాడులు చేయడం కాదని సీఎంను ఒప్పించి బాల్కొండ నియోజక వర్గంలో 50వేల మంది రైతుల రుణమాఫీ చేయాల్సి ఉండగా 20వేల మందికి చేశారని ఇంకా 30వేల మందికి చేయాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు 2500 రూపాయలు, 4వేల పెన్షన్, ఇప్పించాలన్నారు. ఎవరో వరంగల్‌కు చెందిన ఎన్ఆర్ఐ ఫోరం నాయకుడు దేవేందర్‌రెడ్డి తన ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులపై దాడికి వచ్చాడని ఇది న్యాయమా అని ప్రశ్నించారు.

ప్రభుత్వంపై నిందలు వేయడం మానుకో..

- ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి సూచించారు. నిజామాబాద్‌లో హౌజ్ అరెస్టు అయిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం పోయినప్పటి నుంచి బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్‌లు అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని అదే కోవలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని అవమానించే విధంగా తప్పుడు మాటలు మాట్లాడంతా ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకే, ప్రశాంత్‌రెడ్డికి కనువిప్పు కలిగించేందుకు వేల్పూర్‌లో కనువిప్పు కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. ప్రశాంత్ రెడ్డి గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అవినీతిపై కాంగ్రెస్ పార్టీ గత 19 నెలల్లో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అన్నారు. గల్ఫ్ బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశాంత్‌రెడ్డి విమర్శలు చేశారని అవి తప్పుడు మాటలు అని గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గల్ఫ్ బాధితులకు ఏ విధమైన సహాయం చేయలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ఆర్ఐసెల్ ఏర్పాటు చేసి జిల్లాలో 55 మందికి, బాల్కొండ నియోజకవర్గంలో 18 మందికి 5లక్షల చొప్పున అందజేశామన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు వెళ్తున్న తమను పోలీసులు లా అండ్ ఆర్డర్ పేరుతో అడ్డుకోవడం సరికాదన్నారు. ఇంకోసారి రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రశాంత్‌రెడ్డిని గ్రామాల్లో తిరగనివ్వమన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేణురాజ్, గడుగు రోహిత్, పంచరెడ్డి చరణ్, ప్రీతమ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్య సమాజ అభివృద్ధికి మూల స్థంభం అని విద్యతోనే సమాజంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో గోర్తీ ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి నగదు పురస్కారాలు అందిస్తున్న గోర్తీ ఈశ్వర ట్రస్ట్ ఫౌండర్ తిరుపతిరెడ్డికి అభినందనలు తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బందీలు కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి 10వ తరగతి పునాది లాంటిదన్నారు. విద్యార్థులు బలంగా నిర్మించుకుంటేనే భవిష్యత్తు ఆనందంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి విద్య, వైద్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం నగర ప్రజలందరికి అందించడమే లక్ష్యం అన్నారు. నగరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలు వైష్ణవికి 15వేలు, ఆరాధ్యకు 10వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దినేష్, సాయరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

కేంద్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కలిసిన రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.అశోక్‌కుమార్‌ను రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు తోటరాజశేఖర్ మర్యాధపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో అశోక్‌కుమార్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. అశోక్‌కుమార్ గతంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవాన్ని తోటరాజశేఖర్‌తో పంచుకున్నారు. రెడ్‌క్రాస్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల అభినందనలు తెలిపారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటగల్లిలో గల శంకర్‌భవన్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలలోని విద్యార్థులను క్షేత్రస్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో 200కుపైగా బాలికలు ఉన్న పాఠశాలలో ఒకే ఒక బాత్‌రూమ్ ఉందని, భోజనం చేసిన తర్వాత విద్యార్థులు బయటకు వెళ్లి నీళ్లు తాగుతున్నారన్నారు. మినరల్ వాటర్ సౌకర్యం లేదని చాలా తరగతి గదులలో వర్షాలు కురిసినప్పుడు ఊరుస్తున్నాయని, క్లాస్ రూమ్‌లో మరమ్మతులు చేయించాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్ బాత్‌రూమ్స్ లేవని తెలిపారు. స్కూల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే విద్యాశాఖ అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యు నగర నాయకులు నిఖిల్, దుర్గాప్రసాద్, సాయి, రాజు, వంశీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

మోపాల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సై స్రవంతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, మహిళా హక్కు చట్టాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు రూరల్ ఎస్సై ఆరీఫ్, ఎస్సై స్రవంతిలు పాల్గొన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై పోలీసులను సంప్రదించాలని కోరారు. అత్యవసర సమయంలో పోలీస్ శాఖ ఫోన్ నెంబర్లను విద్యార్థులకు తెలియజేశారు. 100, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వేడుకల్లో ఐడీసీఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు

గిరిజనుల సంస్కృతికి అద్దం పట్టేదే తీజ్

● ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

ధర్పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేదే తీజ్ పండుగ అని ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని మద్దుల్ తాండాలో జరిగిన తీజ్ వేడుకల్లో నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు తీజ్ వేడుకను అత్యంత వైభవంగా సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన గ్రామ దేవతలకు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తాండా వాసులందరూ ఆయురారోగ్యాలతో పాడిపంటలతో, పశుసంపదతో కలకలలాడాలని ప్రతియేటా గిరిజనులు తీజ్ పండుగను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, డైరెక్టర్ మంగ్యానాయక్, బంజారా జిల్లా అధ్యక్షుడు బాబురావు, లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కేతావత్ యాదగిరి, తుకారాం నాయక్, దత్తు నాయక్, రాములు పాల్గొన్నారు.

రాజకీయ రగడ

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని నిజామా బాద్‌లో పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని హైదరాబాద్‌లో పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. గల్ఫ్ కార్మికులను ఆదుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ నేతలు దీటుగానే సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు నంగి దేవేందర్‌రెడ్డి పోలీసుల కళ్లుగప్పి వేల్పూర్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి బీఆర్ఎస్ నాయకుడివలే ప్రవేశించాడు. అక్కడ ఫేస్‌బుక్ లైవ్ వీడియో తీసేందుకు ప్రయత్నించగా గమనించిన బీఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా ఆయనపై దాడి చేసి చొక్కా చించివేశారు. దీంతో పోలీసులు దేవేందర్‌రెడ్డిపై దాడిని ఆపి పోలీసు వాహనంలో అతణ్ని తరలించారు. దీంతో ఒక్కసారిగా వేల్పూర్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటా పోటీగా నినాదాలు చేస్తూ తోపులాటకు దిగారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

మొదటి నుంచి మాటల యుద్ధం

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మంత్రిగా జిల్లాలో అన్ని తానై వ్యవహరించిన బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు మధ్య మొదటి నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు భీంగల్ పర్యటనకు రాగా అక్కడ ప్రశాంత్‌రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని ప్రశ్నించగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. అప్పుడు కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలని ఆశిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గంలో పట్టుకోసం ప్రయత్నాలు చేస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తో పాటు ముగ్గురు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లు ఉన్న బాల్కొండ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌లో విభేదాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఒకరంటే ఒకరు ఆధిపత్యం కోసం పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నారు. అంతే దీటుగా స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సైతం వ్యవహరించడంతో నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలకు ముందే రాజకీయ రగడ ప్రారంభమైంది. ఈ వేడెక్కిన రాజకీయాలు జిల్లాలో రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీకి లాభం చేకూరుస్తాయో తేలాల్సి ఉంది.

బాధితలకు పరామర్శ

బీఆర్ఎస్ నాయకుల దాడిలో గాయపడిన నంగి దేవేందర్ రెడ్డి, ఆయన కారు డ్రైవర్లు నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి తదితరులు గురువారం రాత్రి పరామర్శించారు.

వేల్పూర్‌లో తీవ్ర ఉద్రిక్తత

(ఐదో పేజీ తరువాయి)

నినాదాలు చేస్తూ రావడంతో పోలీస్‌లు ఆయనను అరెస్టు చేశారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులను దొరికిన వారిని దొరికినట్లు పోలీస్‌లు అదుపులోకి తీసుకుంటే వాహనాలలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటికి రావడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు ఆయనపై దాడి చేసి కొట్టారు. వెంటనే పోలీస్‌లు అక్కడికి చేరుకొని ఆయన్ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరగడంతో పోలీస్‌లు స్వల్ప లాఠీచార్జి చేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి వేల్పూర్‌కు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి అల్లర్లు జరగనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ, ఎస్సైలను ఆదేశించారు. వేల్పూర్‌లో నిషేధాజ్ఞల వల్ల కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఆర్మూర్ భీమ్‌గల్ వెళ్లే వాహనాలను బైపాస్ రోడ్డు వెంట దారి మళ్లించారు. సాయంత్రం ఆరు గంటలు దాటుతున్నప్పటికీ వేల్పూర్‌లో పోలీస్‌ల మోహరింపు కొనసాగుతునే ఉంది. ఆర్మూర్ సబ్ డివిజన్‌కు చెందిన వివిధ పోలీస్ స్టేషన్‌ల సీఐలు, వివిద పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, పోలీసులు, ప్రత్యేక బలగాలు మోహరించాయి. పోలీసు అదుపులోకి తీసుకున్న పలువురు నాయకులను డిచ్‌పల్లి ఠాణాకు తరలించారు.

సామాజిక విప్లవకారుడు రచయిత ప్రభంజన్ మృతి తెలంగాణకు తీరని లోటు

● ప్రభంజన్ చిత్రపటానికి నివాళ్లు అర్పించిన టీయూ అధ్యాపకులు

డిచ్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డా.మామిడాల ప్రవీణ్, అధ్యక్షతన ప్రొ.ప్రభంజన్ యాదవ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో రిజిస్ట్రార్ ఎం.యాదగిరి మాట్లాడుతూ.. ప్రభంజన్ యాదవ్ సామాజిక విప్లవ కారుడు రచయిత, ప్రభావంతమైన ఉపన్యాసకుడని, ఆయన మరణం, తెలంగాణ ప్రాంత ఉద్యమానికి తీరాని లోటు అని రిజిస్ట్రార్ అన్నారు. తెలంగాణ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నయ్య, మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని ప్రొ.ప్రభంజన్ జీవితం వీడదీసి చూడలేమన్నారు. తెలంగాణ ఉద్యమం బలోపేతం చేయడానికి కేంద్ర ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ వర్సిటీలో జాయిన్ అయ్యారని తెలిపారు. ప్రొ.కనకయ్య మాట్లాడుతూ.. డా.బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే ఆలోచనలు వ్యాప్తి చేయడానికి ఎంతో కృషి చేసిన ప్రభంజన్ యాదవ్ మరణించడం బాధకరమన్నారు. డా.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో బీసీ ఉద్యమ వ్యాప్తికి ప్రధాన భూమికి పోశించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మాస్ కమ్యూనికేషన్ ఆచార్యులు ఘంట చంద్రశేఖర్, టీచర్స్ అసోసియేన్ ప్రధాన కార్యదర్శి మోహన్, డా.జమీల్ ఆహ్మద్, డా.అడికె నాగరాజు, డా.రమణచారి, డా.సత్యనారాయణ రెడ్డి,డా.రాజేశ్వరి, డా.రాంబాబు, డా.కిరణ్మాయి, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాముల తనిఖీ

డిచ్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులం, రాంపూర్, సుద్దపల్లి గ్రామాల్లో గురువారం సహాయ వ్యవసాయ సంచలకులు కృష్ణ సహకార సంఘాల ఎరువుల గోదాములను తనిఖీ చేసి స్టాక్ రిజిస్ట్రార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాస్ ద్వార యూరియ విక్రయించాలని జిల్లాలో ఎక్కడ యూరియ కోరత లేదని రైతులు అపోహాలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. సుద్దపల్లి శివారులో గల వరి పంట ను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. అధికంగా యూరియ వాడటం వల్ల భూసారం తగ్గి, చీడ , పురుగులు అధికమై దిగుబడి తగ్గుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ వ్యవసాయాధికారి శ్రీకాంత్, విస్తీర్ణాధికారులు రుపేశ్, విలస్ లు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.230	రూ.280	రూ. 300





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,500	రూ.90,900	రూ.1150

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : సూపర్ మ్యాన్ (11.00, 7.55)
: ఎఫ్-1 ది మూవీ (1.50)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (5.05)
: జూనియర్ (10.45)
స్ర్కీన్-2 : సైయ్యారా (హిందీ) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్ర్కీన్-3 : జూనియర్ (11.00, 2.10, 7.30)
: స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (5.20)
: క్నోవాట్ యు డిడ్ లాస్ట్ సమ్మర్ (ఇంగ్లీష్ (10.40)
స్ర్కీన్-4 : స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (11.35)
: మై బేబి (1.45, 7.20)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (4.40, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : జూనియర్ (1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : జూనియర్ (11.00)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (1.50, 4.40, 10.30)
: మై బేబి (7.30)
స్ర్కీన్-3 : కొత్తపల్లిలో ఒకప్పుడు (11.00, 7.30)
: మై బేబి (1.30)
: సూపర్ మ్యాన్ (4.30, 10.20)

దేవి: జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏం మాయ చేసావే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మై బేబి (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్